నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
6 డిసెంబర్ 2023
పేజీలు 8

### ఐఐటీ బాంబే టాప్

నవంబర్ 8న విడుదలైన క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2024లో 'ఐఐటీ బాంబే' దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఆసియా ఖండంలో 40వ ర్యాంకు దక్కించుకుంది. 100కు 67.2 స్కోరుతో ఐఐటీ బాంబే ఈ ఘనత సాధించింది. అకడమిక్ రెప్యూటేషన్ (నమ్మకం)లో 83.5, యాజమాన్య రెప్యూటేషన్‌లో 96, అంతర్జాతీయ రీసెర్చ్ నెట్‌వర్క్‌లో 66.3, అంతర్జాతీయ ఫ్యాకల్టీ నిష్పత్తిలో 11.1, పీహెచ్‌డీ ఉన్న అధ్యాపక సిబ్బంది అంశంలో 100కు 100 పాయింట్లు సాధించింది.

## అంతర్జాతీయం

### బుకర్ ప్రైజ్ విజేత పాల్ లించ్

ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్‌ను 2023 సంవత్సరానికి గాను ఐర్లాండ్ రచయిత పాల్ లించ్ గెలుచుకున్నారు. ఆయన రాసిన 'ప్రాఫెట్ సాంగ్' నవలకు ఈ అవార్డు లభించింది. ఐర్లాండ్ దేశం నిరంకుశత్వంలోకి జారిపోతున్న సమయంలో రహస్య పోలీసుల బారి నుంచి తప్పించుకునేందుకు ఓ కుటుంబం పడిన కష్టాలను ఆ నవలలో లించ్ వివరించారు.

### కాప్-28 సదస్సు

యూఏఈలోని దుబాయి వేదికగా కాప్28 సదస్సు జరుగుతుంది. భారత్‌లో ప్రస్తుతమున్న ఉద్గారాల తీవ్రతను 2030 నాటికి 45 శాతం తగ్గించడమే తమ లక్ష్యమని సదస్సులో ప్రధాని మోదీ ప్రకటించారు. శిలాజేతర ఇంధనం వాటాను 50 శాతానికి పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. సదస్సుకు అధ్యక్ష హోదాలో యూఏఈ, అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) డిసెంబర్ 1న కార్బన్ నియంత్రణకు తీసుకున్న చర్యలను ప్రకటించాయి. పునరుత్పాదక ఇంధనాలు, ఇంధన సామర్థ్యాలు, ఆర్థిక సహకారం, శిలాజ ఇంధనాల డిమాండ్-సరఫరా, కర్బన రహిత చర్యలపై విస్తృతంగా చర్చించాయి. అదేవిధంగా 2028లో జరిగే కాప్-33 సదస్సును భారత్‌లో నిర్వహించేందుకు ప్రతిపాదించారు. అనంతరం సదస్సులో పాల్గొన్న దేశాధినేతలతో ప్రధాని మోదీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కాప్28 సమావేశాలు డిసెంబర్ 12 వరకు కొనసాగనున్నాయి. వివిధ దేశాల అధినేతలు సహా మొత్తం 70 వేల మంది ప్రతినిధులు ఇందులో భాగం కానున్నారు.

### తొలి వాణిజ్య విమానం

సంప్రదాయ ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)తో కాకుండా తక్కువ కర్బన ఉద్గారాలను వెలువరించే పర్యావరణ హిత ప్రత్యామ్నాయ ఇంధనంతో వర్జిన్ అట్లాంటిక్ విమానం నింగిలోకి దూసుకెళ్లింది. వంద శాతం సుస్థిర విమాన ఇంధనం (ఎస్ఏఎఫ్) వినియోగించిన తొలి వాణిజ్య విమానంగా రికార్డు సృష్టించింది. ఈ ఇంధనంతో గతంలో సరకు రవాణా విమానాన్ని నడిపినప్పటికీ ప్రయాణికుల విమానం ఇదే మొదటిది. ఇందులో వినియోగించిన వంట నూనెలు, జంతు వ్యర్థ కొవ్వులకు పాడైన మొక్కజొన్న నుంచి తీసిన సింథటిక్ కిరోసిన్ కలిపి తయారు చేసిన ఇంధనాన్ని వినియోగించారు. ఈ విమానంలో వర్జిన్ అట్లాంటిక్ వ్యవస్థాపకుడు రిచర్డ్ బ్రాన్సన్, కొంతమంది సిబ్బంది ప్రయాణించారు.

### బ్యాక్టీరియాకు జ్ఞాపకశక్తి



ఏకకణ జీవులైనప్పటికీ బ్యాక్టీరియాకు జ్ఞాపక శక్తి సామర్థ్యం ఉంటుందని, ఆ జ్ఞాపకాలను తమ వారసులకూ చేరవేయగలవని అమెరికా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆస్టిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. యాంటీబయాటిక్స్ నిరోధకతను సాధించి, మానవుల్లో ప్రమాదకరమైన ఇన్ఫెక్షన్లను కలిగించడం వంటి వ్యూహాలను సిద్ధం చేసుకోవడానికి సంబంధించిన జ్ఞాపకాలను ఏర్పరుచుకోగలవని వివరించారు. బ్యాక్టీరియాకు మెదడు లేకపోయినా అవి తమ పరిసరాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి గుర్తుంచుకోగలవని పరిశోధనకు నాయకత్వం వహించిన సౌవిక్ భట్టాచార్య తెలిపారు. వాటి జ్ఞాపకాలు కనీసం నాలుగు తరాల పాటు కొనసాగుతాయని వెల్లడించారు.

### న్యూజిలాండ్ ప్రధానిగా లక్సన్

న్యూజిలాండ్ కొత్త ప్రధానిగా క్రిస్టఫర్ లక్సన్(53) నవంబర్ 27న ప్రమాణ స్వీకారం చేశారు. అక్టోబర్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల తర్వాత రెండు చిన్న పార్టీల మద్దతుతో లక్సన్‌కు చెందిన నేషనల్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

### సింగపూర్, జ్యూరిచ్ వెరీ కాస్ట్లీ

ఈ ఏడాది ప్రపంచంలో అత్యంత ఖరీదైన నగరాలుగా సింగపూర్, జ్యూరిచ్ నిలిచాయని 'ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ)' తెలిపింది. జ్యూరిచ్ ఆరోస్థానం నుంచి ఎగబాకి సింగపూర్ సరసన చేరింది. గతేడాది సింగపూర్‌తోపాటు తొలి స్థానంలో

నిలిచిన న్యూయార్క్ ఈసారి మూడో స్థానానికి పరిమితమైంది. నిత్యావసర సరకులు, గృహోపకరణాలు, కొన్ని రకాల సేవల ధరలు పెరిగిన నేపథ్యంలో జ్యూరిచ్ ఖరీదైన నగరంగా మారిందని తెలిపింది.

## జాతీయం

### అతిపెద్ద టైగర్ రిజర్వ్

వన్యప్రాణి సంరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో 2,300 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్ ఏర్పాటు కానుంది. ఇందుకోసం మధ్యప్రదేశ్‌లోని నౌరదేహి వన్యప్రాణి అభయారణ్యం, రాణి దుర్గావతి వన్యప్రాణి అభయారణ్యాలను కలపనున్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలకు నవంబర్ 26న కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ రెండు అభయారణ్యాలు సాగర్, దమోహ్, నర్సింగ్‌పూర్, రైసెన్ జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి.

### ఎన్ఎండీసీకి అవార్డులు

నవరత్న ప్రభుత్వరంగ సంస్థ ఎన్ఎండీసీ జాతీయ స్థాయిలో పలు పబ్లిక్ రిలేషన్స్ అవార్డులను సాధించింది. హౌస్ జర్నల్ (హిందీ), మహిళాభివృద్ధిలో సీఎస్ఆర్ ప్రాజెక్టు, సుస్థిరాభివృద్ధి నివేదిక, వార్షిక నివేదిక తదితర అంశాల్లో ఈ అవార్డులు దక్కించుకుంది. నవంబర్ 26న ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఫెస్టివల్-2023 సందర్భంగా పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ సోనల్ మాన్‌సింగ్ ఎన్ఎండీసీ అధికారులకు అవార్డులను బహూకరించారు.

### బాల కరోడ్‌పతి

బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న గేమ్ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి (కేబీసీ)లో 14 ఏండ్ల బాలుడు రూ.కోటి గెలుచుకుని రికార్డు సృష్టించాడు. కేబీసీ జూనియర్స్ స్పెషల్‌లో భాగంగా హరియాణాలోని మహేంద్రగఢ్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి మయాంక్ నవంబర్ 28న జరిగిన ఎపిసోడ్‌లో అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పి రూ.కోటి గెలుచుకున్నాడు. 'కొత్తగా కనుగొన్న ఖండానికి అమెరికా అని పేరు పెట్టి, దాని మ్యాప్‌ను తయారు చేసిన యూరోపియన్ క్యాట్రోగ్రాఫర్ ఎవరు?' ప్రశ్నకు 'మార్టిన్ వాల్డ్‌సీముల్లర్' అని సమాధానం చెప్పి రూ.కోటి సొంతం చేసుకున్న తొలి జూనియర్ కంటెస్టెంటుగా నిలిచాడు.

### ఒడిశాలో బ్లాక్ పాంథర్

ఒడిశా అడవుల్లో బ్లాక్ పాంథర్ (నల్ల చిరుత) కనిపించింది. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ సుశాంత నందా వివరాలు వెల్లడించారు. పులుల గణన కోసం ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు ఈ చిరుత చిక్కినట్లు తెలిపారు. నల్ల చిరుత కనిపించడం ఇదే మొదటిసారి కాదని, 2018లో సుందర్‌గఢ్ జిల్లా అడవుల్లో ఒకసారి కనిపించిందన్నారు.

## తెలంగాణ

### మాంసం లభ్యతలో టాప్

దేశంలో మాంసం లభ్యతలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. ఈ మేరకు ప్రాథమిక పశు పోషణ గణాంకాల (బేసిక్ యానిమల్ హస్బెండరీ స్టాటిస్టిక్స్) వార్షిక నివేదిక-2023 వెల్లడించింది. మాంసం ఉత్పత్తిలో మాత్రం ఐదో స్థానంలో ఉందని పేర్కొంది. కోడిగుడ్ల తలసరి లభ్యతలో 2, ఉత్పత్తిలో 3వ స్థానంలో నిలిచింది. పాల ఉత్పత్తి, లభ్యతలో 13వ స్థానంలో ఉంది. తెలంగాణలో నాలుగేళ్లుగా అమలు చేస్తున్న గొర్రెల పంపిణీ పథకం కారణంగానే మాంసం ఉత్పత్తి, లభ్యత పెరిగాయి. ఈ పథకం కింద ఇప్పటి వరకు 1.28 కోట్ల గొర్రెల పంపిణీ జరిగింది. అదేవిధంగా రాష్ట్రంలో 1500 పైగా కోళ్ల ఫారాలు ఉన్నాయి. కేంద్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో బీఏహెచ్ఎస్ జాతీయస్థాయిలో ఏటా పశు పోషణ గణాంకాలు సేకరిస్తూ వార్షిక నివేదికలు రూపొందిస్తుంది.

### కాంగ్రెస్‌కు తొలి విజయం

తెలంగాణలో నవంబర్ 30న జరిగిన శాసనసభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ 64 స్థానాల్లో గెలుపొంది ప్రభుత్వ ఏర్పాటుకు అర్హత సాధించింది. రాష్ట్రం ఏర్పడ్డాక ఆ పార్టీకి ఇది మొదటి విజయం. బీఆర్ఎస్ 39 స్థానాల్లో గెలుపొంది రెండో స్థానంలో నిలి

చింది. అదేవిధంగా భాజపా 8, ఎంఐఎం 7 స్థానాల్లో గెలుపొందాయి. అదేవిధంగా తెలంగాణతో పాటు ఎన్నికలు జరిగిన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో భాజపా అత్యధిక స్థానాలు గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

### ఆర్‌జీయూకేటీకు పురస్కారం

బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ప్రతిష్ఠాత్మక గ్రీన్ యూనివర్సిటీ అవార్డు-2023కు

ఎంపికైంది. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 28వ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్) సమావేశాన్ని నవంబర్ 30 నుంచి డిసెంబర్ 12 వరకు దుబాయిలో నిర్వహిస్తున్నారు. ఏడాది కాలంలో సుమారు 72 ఎకరాల్లో మొక్కలు పెంచడం, ఎకో పార్క్ ఏర్పాటు, కాలుష్య నివారణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఆర్‌జీయూకేటీ తెలంగాణ నుంచి ఈ అవార్డుకు ఎన్నికైంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు, వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి.వెంకటరమణ డిసెంబర్ 1న దుబాయిలో అవార్డును అందుకున్నారు.

## క్రీడలు

### శ్రీవల్లికి ఐటీఎఫ్ టైటిల్

హైదరాబాద్ టెన్నిస్ యువతార భమిడిపాటి శ్రీవల్లి రష్మిక కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. బెంగళూరులో నవంబర్ 26న ముగిసిన మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ టోర్నీలో 21 ఏళ్ల శ్రీవల్లి చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్‌లో 6-0, 4-6, 6-3తో భారత్‌కే చెందిన జీల్ దేశాయ్‌ను ఓడించింది. ఈ విజయంతో డబ్ల్యూటీఏ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో రష్మిక 181 స్థానాలు దాటుకుని 706వ ర్యాంకు నుంచి 525వ ర్యాంకుకు చేరుకుంది.

### టీ20 ప్రపంచకప్‌నకు నమీబియా

2024 టీ20 ప్రపంచకప్‌నకు నమీబియా అర్హత సాధించింది. ఆఫ్రికా తరపున పొట్టి కప్పు బెర్తు సంపాదించిన తొలి జట్టుగా నమీబియా నిలిచింది. నవంబర్ 28న టాంజానియాపై 58 పరుగుల ఆధిక్యంతో నమీబియా విజయం సాధించింది. ఆఫ్రికా క్వాలిఫయర్స్‌లో అయిదింటికి 5 మ్యాచ్‌ల్లో నెగ్గడంతో నమీబియాకు పొట్టి కప్పు బెర్తు దక్కింది. మరో బెర్తు కోసం ఉగాండా, కెన్యా, జింబాబ్వే, నైజీరియా రేసులో ఉన్నాయి. వచ్చే ఏడాది వెస్టిండీస్‌లో టీ20 ప్రపంచకప్ జరగనుంది.

### ప్రొ కబడ్డీ సీజన్-10 షురూ

ప్రొ కబడ్డీ లీగ్ డిసెంబర్ 2 నుంచి ప్రారంభమైంది. ఇప్పటికి 9 సీజన్‌లు పూర్తి చేసుకుని పదో సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సీజన్‌లో మొత్తం 12 జట్లు తలపడను

న్నాయి. లీగ్ దశ లో మొత్తం 132 మ్యాచ్‌లు జరుగుతాయి. ఇవి 2024 ఫిబ్రవరి 21న ముగుస్తాయి. ప్లేఆఫ్స్, ఫైనల్ తేదీలు తర్వాత ప్రకటిస్తారు. హైదరాబాద్ వేదికగా గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 19 నుంచి 24 వరకు 11 మ్యాచ్‌లు జరుగుతాయి. వీటిలో తెలుగు టైటాన్స్ నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది.

### గ్రాండ్ మాస్టర్‌గా వైశాలి

చెస్ గ్రాండ్ మాస్టర్ హోదా దక్కించుకున్న భారత మూడో మహిళా క్రీడాకారిణిగా వైశాలి (22) రికార్డు నమోదు చేసింది. ఈమె కంటె ముందు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక ఉన్నారు. భారత్ తరపున ఈ ఘనత సాధించిన 84వ చెస్ ప్లేయర్ వైశాలి. గ్రాండ్ మాస్టర్ హోదా సాధించాలంటే మూడు జీఎం నార్మ్‌లతో పాటు ఖాతాలో 2500 ఎలో రేటింగ్ పాయింట్లుండాలి. ఈ ఏడాది అక్టోబర్‌లో ఖతార్ మాస్టర్స్ టోర్నీలోనే ఆమె మూడో జీఎం నార్మ్ అందుకుంది. ప్రస్తుతం స్పెయిన్‌లో జరుగుతున్న ఎల్ లోబ్రెగాట్ ఓపెన్‌లో వరుసగా రెండు రౌండ్లలో

విజయాలు సాధించి రేటింగ్ కూడా సంపాదించింది. వైశాలి భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానందకు అక్క. గ్రాండ్ మాస్టర్ హోదా సాధించిన మొట్టమొదటి అక్కాతమ్ముడుగా చరిత్ర సృష్టించారు.